# ఖడ్గ తిక్కన

[ఏకాంకిక]

●

= శ్రీ రామచంద్ర శాస్త్రి =

[కథాసందర్భము]

మనుమసిద్ధిరాజునకూ, కాటమరాజునకూ పశువులపుల్లరి చెల్లించటంలో తగాదా వచ్చింది. ఖడ్గ తిక్కన మనుమసిద్ధిరాజు కొలువుకూటంలో సేనాపతి. కావ్యతిక్కన ప్రధానామాత్యుడు. ఖడ్గతిక్కన మహాయోధులతో ప్రతికక్షులమీదకు దండు వెళ్లాడు. కాటమరాజు బ్రహ్మరుద్రయ్య నాయకత్వమున సైన్యమును పంపాడు. ఉభయసైన్యాలూ పాలేటి యొడ్డున పంచలింగాలవద్ద డీకొన్నాయి.

నాటికి రెండు నెల లయింది. ఖడ్గతిక్కన సైన్యమంతా యుద్ధరంగంలో హతమైంది. ప్రతికక్షి పిన్నమనాయుడు పరాభవపూర్వకంగా పరామర్శించాడు. మళ్లీ సైన్యం సమకూర్చుకొని పోవుటకు తిక్కన విక్రమసింహపురి* ప్రవేశిస్తున్నాడు గుర్రంమీద.

* * * *

## మొదటిదృశ్యం

[నెల్లూరుపురవీథి. సందడిసమయం]

అచ్చిరాజు—ఏమన్నా! మాదిరాజూ! ఏమైందట మన బాపనాయన కూడగట్టుకునిపోయిన యుద్ధం? ఇప్పటికి అంతూ పంతూ లేదే!

మాదిరాజు—కూడగట్టుకునిపోయింది బాపనాయనైనా తలపడేది మనోళ్లేకదా! ఏదో వోటి కబురే విన్నాను.

అచ్చి—నేనూ అదే విన్నాను. అందరూ సచ్చారంట.

(గంగరాజు అను యువకుడు పరుగెత్తివస్తాడు.)

గంగ—మనోళ్లు వోడిపోయారంట! అరుగో తిక్కన్నగారొక్కడే వచ్చేస్తున్నాడు.

(ఖడ్గ తిక్కన్న ఒక్కడే గంభీరముఖంతో గుర్రంమీద వస్తూవుంటాడు)

అచ్చి—దొరోరి పలుకుబడి వుండగానే సరా! నిన్న పెళ్లైన తిప్పరాజునీ, మొన్న కొడుకునికన్న కంఠరాజునీకూడా లాక్కెళ్లాడు మొనగాడిలాగా! జండెంపోగుల కేం తెలుస్తుందిరా కత్తిపస?

(ఖడ్గతిక్కన ప్రక్కనుంచి పోతూ యీమాటలు విని ఖిన్నుడౌతాడు.)

మాది—మన గంగిరెడ్డి నడపుకుపోతానంటే పోనిచ్చాడా? అయినా, పశువుల పుల్లరికాడ పెద్ద తగువు దేనికి చెప్పు? కొసకి మన దొర కాటమరాజుకి తీసిపోయినట్లేగా!

అచ్చి—అంతకాక మరేముందిలే!

## రెండో దృశ్యం

[మరొక వీథిలో. స్త్రీలు బావివద్ద నీళ్లు తోడుకుంటూ నవ్వులూ, కేరింతలూ కొడుతూవుంటారు. ఒక యువకుడు పరుగెత్తుకొని వస్తాడు.]

యువకుడు — ఏం సంతోషాలో! ఎందరి కొంపలు కూలిపోయాయో విచారించండి. మన సైన్యమంతా మచ్చుకైనా లేకుండా మడైపోయిందట యుద్ధంలో! సేనాపతి తిక్కన్నగారొక్కరే వస్తున్నారు.

(స్త్రీలంతా ఆక్రందనం చేస్తారు.)

వృద్ధస్త్రీ—ఆ! ఆ! వద్దంటే పెబుబక్తి అని వెళ్లాడు మావోడు. ఈయుద్ధాలు పెబువులకోసం

* నెల్లూరునే చరిత్రకారు లిట్లంటారు.

కాదు, పేదోళ్లని మట్టం సెయ్యటానికేనోయ్ దేవుడా !

(ఏడుస్తుంది.)

ఒకస్త్రీ—మా తిప్పరాజు ! మా కొత్తల్లుడు కూడానా ! అయ్యో ! తల్లీ ! నీ కుత్తుక కోశాడే తిక్కన !

ఒక యువతి— ఇల్లిల్లూ వెదకి గుంజుకెళ్లేడు మొనగాడిలాగా !

(ఖడ్గతిక్కన గుర్రంపై ఆవైపు వస్తాడు.)

వృద్ధస్త్రీ—(ఆవేశంతో) నాయనా ! కుర్రోళ్ల కుత్తుకలు కోయించి సల్లంగా వస్తున్నావా యింటికి ? నీ తల్లివంటి తల్లులూ, నీ పెళ్లాంవంటి పెళ్లాలూ వాళ్లందరికీ లేరనుకున్నావా ?

(ఖడ్గతిక్కన జవా బియ్యబోయి నిరుత్తరుడౌతాడు. సిగ్గుతో తల వంచుకుని వెళ్లి పోతాడు.)

## మూడో దృశ్యం

[సెరజాణల వీథి. భోగం మధురవాణి మేడ మీద వసారాలో కూర్చొని యుంటుంది. మధురవాణి పెంపుడుకుక్క పొరుగింటి కుక్కతో పోట్లాడి పారిపోయి కుంటుతూ పెద్ద ఆక్రందనంతో వస్తూవుంటుంది. వెనుకనుంచి తిక్కన ముసుగుతో వస్తూవుంటాడు.]

మధుర—(కుక్కని చూసి) చావరాదూ ! అక్కడే. కుంటికా ల్లేసుకుని తిరిగి రాకపోతే ! ఇన్నాళ్లనుంచీ పెంచిన దిందుకేనా ? ఛీ! ఛీ! పో!పో!

(అని గదుముతుంది. తిక్కన తననే నన్నట్లుగా భావిస్తాడు. గుర్రాన్ని మరోవైపు త్రిప్పి వెళ్లి పోతాడు.)

## నాలుగో దృశ్యం

[ఖడ్గతిక్కన గుర్రం దిగి యింట్లో ప్రవేశిస్తాడు' తండ్రి సిద్ధనామాత్యుడు అదివరకే పరాజయవార్త విని యుంటాడు.]

సిద్ధ—ఎవ్వ రావచ్చేది?...నిన్నే !

తిక్కన—(దీనముగా)కదనరంగమునుండి తిరోహితుడైన జీవచ్ఛవము తిక్కన.

సిద్ధ— ఛీ ! తుచ్ఛుడా ! లక్షనవయువకుల ప్రాణాలకంటె నీప్రాణాలు తీపయేయా ? పులియింట పిల్లి పిల్ల జనించింది ! యుద్ధరంగముననే ఉరిపెట్టుకొనక "తిరోహితు డైన తిక్కన"యట! "ప్రాణము తీపిగా దాచుకున్న తిక్కన" యని నగరమంతా ఆడిపోసుకుంటూవుంటే యీవృద్ధాప్యంలో యీదుర్భర పరాభవము భరించుట యెట్లు ? బ్రాహ్మత్వానికీ, క్షాత్రానికీ చాలా తేడా వుంది.

తిక్క—యుద్ధంలో కలిగే జయాపజయాలు కేవలం వ్యక్తులమీదనే ఆధారపడియుంటాయా నాయన గారూ ! నేను తిరిగివచ్చినది ప్రాణాలపై తీపిచే కాదు. పునఃప్రయత్నమున శత్రువులను తుదముట్టించు కాంక్షతో. ఆశీర్వదించండి.

సిద్ధ—అంతకంటె కావలసిన దే మున్నది? యుద్ధరంగవీరత్వప్రాప్తి రస్తు.

(తిక్కన లోని కేగును.)

## ఐదో దృశ్యం

[తిక్కన స్నానమునకై వేచియుంటాడు. భార్య మాంచాల భర్తను చూడనట్లు పరాకుగా వుంటుంది]

తిక్క—స్నానానికి నీళ్లేవీ ?

మాంచాల—విజయలక్ష్మి ప్రాప్తగర్వమున జలకములాడ నీకే కనిపింపదుకాబోలు అదుగో, ఆ మంచముచాటున పరికించిన......

(అచ్చట నులకమంచము, మంచపుకోడుమీద పసుపు, ఆ చాటున నీళ్లబిందె వుంటాయి. తిక్కన ఆశ్చర్యముతో చూచును.)

మాంచాల—ఏమీ, యిందులో సందేహింపవలసిన దేమున్నది ?

"పగరకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకులందున్
ముగు రాడువార మైతిమి
వగపేటికి జలకమాడ వచ్చినచోటన్ ?"

(తిక్కన తిరిగిపోతాడు.)

## ఆరో దృశ్యం

[తిక్కన మౌనంగా భోజనం చేస్తూవుంటాడు. తల్లి వడ్డిస్తూవుంటుంది.]

తిక్క—మజ్జిగ !

తల్లి—(పెరుగు తెచ్చిపోస్తూవుంటుంది. అది విరిగిపోయి నీళ్లుగా వుంటుంది.)

తిక్క—(ఆశ్చర్యంగా తలయెత్తి చూస్తాడు.)

తల్లి—అబ్బే ! ఏముంది?

" అసదృశముగ నరివీరుల
పసమీరగ గెలువలేక పందక్రియ నీ
వసి వైచి విరిగివచ్చిన
పసులు న్విరిగినవి తిక్క పాలు న్విరిగెన్."

(తిక్కన భోజనం వదిలేసి లేస్తాడు.)

## ఏడో దృశ్యం

తిక్కన—(తనలో)ఆహా ! కాలగతి ! వ్యతిరేక శక్తులు వ్యక్తిగతంగా పనిచేస్తున్నాన్నాళ్లూ మానవుని లో మరుగుపడిన మహత్వాలు బయటకు వస్తాయా ? రావు, రావు. పురజనుల ఛూత్కారాలు, పితృపాదుల తృణీకారం, భార్యగర్హణలు, మాతృదేవియవమానమూ భరించి తిక్కన ప్రాణాలతో తిరుగుతున్నాడు. ఎందుకు? ఖడ్గతిక్కనప్రాణం లక్ష తెలుగు వీరుల ప్రాణంకన్నా తీపిచేనట!—తీపి ! ప్రాణంపై తీపి ! యుద్ధరంగంలో ఆత్మహత్య కావించుకున్నామేలేనట! ఖడ్గతిక్కన తన ఖడ్గం మొక్కవోనన్నాళ్లూ వీర విరుద్ధమైన అవివేకాని కొడిగట్టడని యీ తెలుగు ప్రజకు తెలియదు.

ఓ తెలుగు ప్రజలారా! యిదే నా శాపం! మీరు మీ నాయకులను గుర్తించలేరు. మీ వీరులను మీరు వినుతింపలేరు.

కాలగర్భములో కమ్మకునిపోయిన వన్నీ కలికి ఉన్నతశిఖరాల కెత్తించటమే తెలుసు మీకు. కళ్ల ముందర కనిపించే కైలాసాన్ని కూడా మీరు గుర్తించలేరు. తెల్లనివన్నీ పాలని నమ్మే యీ తెలుగుప్రజ కీనాడు తెలియదు తిక్కనహృదయసముద్రంలో ప్రజ్వరిల్లే శౌర్య బడబానలం.

ఇప్పుడే అపూర్వమైన సైనికబలంతో తిరిగి వెళ్లెదను. జయాపజయములకు కులతత్వమా ? శౌర్య స్థైర్యాలకు కులహక్కులా ? కాదు, కాదు. కాదని నిరూపించటానికే తిక్కన ఖడ్గహస్తు డయినాడు. కావ్యఖడ్గములను చిత్రగతుల నడుపగల ధురీణులని నిరూపింపబడుదు రీ తిక్కనలే !

ఇక రాజసన్నిధికి వెళ్లకతప్పదు.

(నిష్క్రమణ.)

## ఎనిమిదో దృశ్యం

[మనుమసిద్ధిరాజు కొలువు తీర్చియుంటాడు. తిక్కనసోమయాజి తన నిర్వచనోత్తర రామాయణం పుటలు త్రిప్పుతూ వుంటాడు.]

మనుమ—తిక్కనామాత్యా! ఏదీ తాము రచించిన గ్రంథపు ఛవి ?

తిక్కన–చిత్తం ! ఉపక్రమణ ముదాహరణం :

" ద్రవిడోర్వీపతిగర్వముం దునిమి శౌ
ర్యం బొప్ప గర్ణాట ద
ర్ప విఘాతంబు నొనర్చి వైరి మనుజేం
ద్ర శ్రేణికిన్ గొంగనా
నవనిం బేర్కొనియున్నయట్టి విజయ
క్ష్మాధీశ్వరుం గాసిగా
నెవిచెం జోళన మన్మసిద్ధి యని బ్రా
యేటం బ్రగాఢోద్ధతిన్."

మను—ఏదీ ఆచివరిపాదం మరల వినిపింపరూ!

తిక్క—......"విజయక్ష్మాధీశ్వరుం గాసిగా నెవిచెం జోళనమన్మసిద్ధి యని బ్రాయేటం బ్రగాఢోద్ధతిన్ "

మను—కవివర్యుల కావ్యములలో మాప్రసక్తి తేనేల ?

తిక్క—అకావ్యకన్య ప్రభువులనే వరించి యుండనోపు.

(సేవకుడు ప్రవేశించును)

సేవ—దేవరా! పాలేటియొడ్డుపోరినుండి తిక్కన సేనాని తిరిగివచ్చి ప్రభుదర్శనమునకు రానున్నారు.

మనుమ—ఏమీ! విజయలక్ష్మినినాదము లేకుండగనే?

(వెలకంచి వెంగళపతిరాజు—మరియొకమంత్రి—సమయం దొరకిన దన్నట్లు లేస్తాడు)

వెంగళ—ప్రభూ! ఇంకెక్కడి విజయలక్ష్మి? లక్షసైన్యము మచ్చున కొక్కడైనను లేకుండ పంచలింగాలవద్ద మలగిపోయినది. అధికారము కావ్యకర్తల కిచ్చిన ఫలితము......(అర్థోక్తి)

మనుమ—వెంగళరాజా! ప్రసంగము పెంచకు.

(తిక్కనవైపు తిరిగి) కాటమరాజు సైన్యము మన సైన్యమును మించియుండెనేమో?

తిక్క—కానియెడ ఖడ్గతిక్కన పగతురకు వెన్నిచ్చి పరుగిడు పారుడు కాడు. అన్నియు అనతి కాలముననే వ్యక్తము కాగలవు.

(ఖడ్గతిక్కన ప్రవేశము)

ఖడ్గతిక్కన—ప్రభూ! పాలేటియొడ్డున మన సైన్య మహోరాత్రములు పోరాడి పటాపంచలైనది. శత్రువుల సేనానివహము మనకన్న సంఖ్యలో మిన్న. అయినను రెండువారము లేకదీక్షతో ముందువెనుకలు లేక మన సైనికులు పోరాడి నిహతులైరి. సుశిక్షితమగు మహాసైన్యమును కొనిపోయి శత్రువులను మట్టుపెట్ట ప్రభువుల యాజ్ఞకై వచ్చితిని.

మనుమ—ఎవరి యోష్ఠమునుండి యీపలుకులు? అవక్రపరాక్రమోపేతుడగు ఖడ్గతిక్కనయోష్ఠము నుండియేనా? పరాజయమెరుగని ప్రజ్ఞాధురీణుని పలుకులేనా యివి? తిక్కనసేనానీ! యింకెక్కడి విజయము? మరల సైన్యములను కొనిపోయి శత్రువుల నెదుర్చుటా? మన యసమర్థత నంగీకరించి మిన్నకుండుటయే యుక్తము.

వెంగళ—ఔను ఏలికా! మరల సైన్యమును సమకూర్చుట యన రాజ్యములో అల్లకల్లోలము, తిరుగుబాటు రాకతప్పదు. ఇంతటితో ఆయుద్యమము విరమించుటే యుక్తము.

మనుమ— తిక్కనామాత్యా! మీయభిప్రాయము?

తిక్కన సోమ—మన కిది పరాజయము కాదు. ఇందు మనము పగతురకు వెన్నిచ్చినది లేదు. మరల ఇనుమడించిన సమరోత్సాహముతో దాడివెడలి మనుమసిద్ధిభూపతి కాటమరాజున కోటుపడలేదని నిరూపించుటయే రాజధర్మము.

ఖడ్గ తిక్కన—ఆంధ్రభూపాలుడు మనుమసిద్ధి ఒక సామంతరాజున కోడి మిన్నకుండె నను కళంకము కన్న సర్వస్వము నొడ్డి విజయలక్ష్మి కాంచె నను పేరే క్షాత్రోచితధర్మము. లేనియెడ తెలుగురాజచరిత్ర కొక మచ్చ రాకమానదు. రాజా! కర్తవ్యమును యోచింపుడు. క్షాత్రధర్మము విడనాడకుడు. ఖడ్గతిక్కన తన యకుంఠిత కుఠారమును చేబూని కదనరంగమున నున్నంత వరకు ఆంధ్రభూపాలుడు మనుమసిద్ధికి ఓటమి యను మాట యుండదు. మరల సైన్యమును సమకూర్పదలచిన ప్రజలలో కలవర మేర్పడు ననుకొనుట భ్రమ. తిక్కనల నతిక్రమించి తిరుగుబాటా? అసంభవము.

మనుమ—తిక్కన లిరువు రేకీభవింప కర్తవ్యము మరియొకరీతి నెట్లు కాగలదు? నేడే తగు సైన్యముతో తరలిపొండు.

తిక్కన సోమ— మనుమసిద్ధిభూపాలునకు విజయము సిద్ధించుగాక.

(ఖడ్గ తిక్కన నిష్క్రమణ)

## తొమ్మిదో దృశ్యం

[ఖడ్గతిక్కన ప్రచండవిక్రమార్కుడై యుద్ధరంగమున నంతట తానెయై పోరుచున్నాడు. ఇరువంకల పలువురు సైనికులు నిహతులగుచున్నారు. అంతట ప్రతికక్షి పిన్నమనాయుడు తిక్కనతో ప్రసంగించును.]

పిన్నమ—తిక్కనసేనాపతీ! రణరంగమున పోరాడుట విప్రుల కనుచితము. ఇకనైన విరమించి ప్రాణములను దక్కించుకొనుము. విప్రులను వధించినచో క్షాత్రమున కనుచితమగు కార్యము చేయుటయు, బ్రహ్మహత్యాదోష మాపాదించుకొనుటయు నగును.

పరస్పరధర్మములను కాపాడ నెంతువేని యీ యుద్యమము నింతటితో విరమింపుము.

ఖడ్గ తిక్కన—ఏమీ! పిన్నమనాయుడా! సమరము చేయ సామర్థ్యము కలదేని కత్తి దూసి కలియుము. లేనియెడ మూల కొదిగి మా పశువుల పుల్లరి చెల్లింపుము. ఈ శాస్త్రధర్మములు నే నెరుగనివి కావు. ప్రాణములనైన బలియిత్తునుకాని పట్టిన ప్రతిన వీడను.

(బ్రహ్మరుద్రయ్య ఆరాధ్యబ్రాహ్మణుడు. ప్రతిశత్రుల సేనాపతి. అట ప్రవేశించును.)

బ్ర. రు. — పిన్నమనాయుడా! విప్రునితో పోరాడ మరియొక విప్రుడ నేను గలను. నీ వితరరంగముల పోరాడుము. తిక్కనచేత బ్రహ్మరుద్రయ మడియుటో, బ్రహ్మరుద్రయచేత తిక్కన నిహతుడగుటయో నేడే తేలగలదు.

(నిష్క్రమణ.)

## ఆఖరుదృశ్యం

[బ్రహ్మరుద్రయ ఖడ్గతిక్కనలు ఘోరముగా పోరాడుతూవుంటారు. ఇరువురి గుఱ్ఱములును హతమగుటచేత వారు ద్వంద్వయుద్ధమున పోరాడుచుండగా ఒకరిపో టొకరికి తగిలి యిరువురును నేల కొరిగెదరు.]

తిక్క—(బాధతో పొరలుచుండును. రక్తము వెల్లువ లగుచుండును. కత్తిమాత్రము కరముననే యుండును.) ఆహా! ఖడ్గమా! నీవు ఎందరు వీరుల హృదయములను దూసి మాటు పెట్టితివో! నేటికి నాజన్మ పరిపూర్ణత నందినది.......తిక్కన కదనరంగమునుండి పిరికియై తిరోహితు డయ్యెడివాడేరి యీమరణ మాసింపడు. తెలుగుతల్లీ! నేడుకదా యీ తిక్కనకు కలిగిన కళంకము మాసిపోవునది! క్షాత్రము కులతత్వముపై నేర్పడు ఒకరి సొత్తు కాదని ఋజువైనది.

ఓ తెలివిగల తెలుగుప్రజలారా! ఈ తిక్కన ప్రాణముపై తీపిచే కదనరంగమునుండి తిరోహితు డయ్యెనని తిరిగి పలుకకుడు......తిక్కనకు ప్రాణము తీపా?......కాదు...తీపి కాదు. ఇదుగో ఈ రక్తపు చవి...... (జిహ్వకు రక్తము రాచుకొనును.)... పులుపు...పులుపు...తిక్కనకు ప్రాణము పులుపు... తీపి కాదు ... తీపికాదు ... సింహపురివాసులారా! మీ కోర్కె సిద్ధించినది...తండ్రీ! తిరిగి నీముఖము చూడగోరను......"యుద్ధరంగ వీరత్వ ప్రాప్తిరస్తు" ...దీవన ఫలించినది...... మాంచాలా ... నీవు వీరపత్నివి......తల్లీ! తల్లీ! అనినుండి విరిగి వచ్చువాడని తలువకుమమ్మా!...తిక్కన అట్లు తిరిగిరాడు. కరవాలమా!...... నీవు చిరకీర్తి నందెదవు...... తిక్కనప్రాణములు తీపికావని తెలియజేసితివి...... తిక్కనప్రాణములు తీపి కావు ...... కావు ...... తీపి కావు.